

4 మే 2017

# కవితా!

సమకాలీన కవితల కాలనాళిక

# కవితా! 47

సమకాలీన కవితల కాలనాళిక

మే - 2017



నిర్వాహక సంపాదకుడు : శ్రీశ్రీ విశ్వేశ్వరరావు

సెల్ : 94906 34849

సంపాదకుడు : బండ్ల మాధవరావు

సెల్ : 88976 23332

బుక్ మేకింగ్ : ఎ. గిరిధర్

సెల్ : 97042 44344


మాట్లాడండి ! రాయండి !! కలవండి !!!


సాహితీమిత్రులు

Regd. No. 48/2012/IV విజయవాడ.

28-10-26, మసీదు వీధి, అరండల్‌పేట, విజయవాడ - 2

ఫోన్ : 0866 2433359 సెల్ : 9392971359

editor.kavithaa@gmail.com కి కవితలు, వ్యాసాలు పంపండి.



కవుల, రచయితల అభిప్రాయాలు వారి వారి స్వంతం. అవన్నీ అనివార్యంగా పత్రిక అభిప్రాయాలు కానవసరం లేదు. - పబ్లిషర్స్


సాహిత్యం ప్రయోజనం ఏమిటి? ఈ ప్రశ్న ఎప్పుడూ తిరిగి తిరిగి ఎక్కుపెడుతూనే వుంటారు. దీనికి ప్రాచీనుల నుండి అర్వాచీనుల వరకు ఎంతోమంది సాహిత్యకారులు సమాధానం చెబుతూనే వున్నారు. సాహిత్యం ఎవరికి చేరాలి, ఎవరిని సంతోషపెట్టాలి. ఎవరి సమస్యల పరిష్కారానికి దారులు వేయాలి, ఎవరి జీవితాల్ని ప్రతిబింబించాలి – ఈ అంశాలని నిరంతరం చర్చిస్తూనే వున్నాం. సాహిత్యం ఎప్పుడూ కొందరి జీవితాలనే స్పర్శిస్తూ వచ్చిందనేది నిర్వివాదాంశం. ఆకాశపు దారుల్లో హడావుడిగా వెళ్ళిపోయే స్థితి నుండి భూమార్గం పట్టిన తరువాత అది విస్తృతమయ్యే క్రమంలో అనేక పార్శ్వాలను తడుముతూ నడుస్తున్నదన్నది యదార్థం. కవి లేదా సృజనకారుడు సర్వాంతర్యామి కాదు. సర్వకాల సర్వావస్థలను తన రచనలలో ప్రతిబింబించలేడు. సాహిత్యం విస్తృతమయ్యేకొద్దీ అప్పటివరకు చూడని కోణాల్ని, అప్పటివరకు స్పృశించని జీవితాల్ని వెలికి తీసుకొస్తున్నది. ఇలాంటి స్థితిలో గత కాలపు రచనలను, సృజనకారులను వారు చూడని కోణాల మీద ప్రశ్నించడం సరైనది కాదు. నన్నయ కావచ్చు, గురజాడ కావచ్చు, శ్రీశ్రీ కావచ్చు, జాషువా కావచ్చు. ఎవరైనా తమ చుట్టూ వున్న, తమకు తెలిసిన, తాము అనుభవించిన జీవితాలను తమ రచనలలో ప్రతిబింబించారు. వారి ప్రగతిశీల దృక్పథం, తద్వారా వచ్చిన ఉద్యమాలు సంఘసంస్కరణల ద్వారా మనం నిఠారుగా నిలబడగలుగుతున్నాం. ఇప్పుడు మనల్ని నిలబెట్టిన వారినే ప్రశ్నించబూనడం ఎంతవరకు సబబు. ఎవరైనా తమచుట్టూ వున్న చీకటిని పారద్రోలడం కోసం తమకు చేతనైన మార్గంలో పనిచేస్తే, అదిచాలు. సమాజం ముందుకు వెళ్ళడానికి, బుద్ధిజీవులు తమ రచనలను దార్శనికతతో చేస్తారు. కొంతకాలానికి అవి చేరాల్సిన వారికి తప్పక చేరతాయి.

## ఇందులో కవులు, విమర్శకులు...


| | |
|---|---|
| డా. కాసల | మాతంగి దిలీప్‌కుమార్ |
| లలితానంద్ | అరసవిల్లి కృష్ణ |
| పాపినేని శివశంకర్ | మందరపు హైమవతి |
| జనజ్వాల | శశిధర్ పింగళి |
| కాశీభట్ల వేణుగోపాల్ | సాహితి పెద్దింటి (అ) |
| ఉదయమిత్ర | ప్రసాదమూర్తి |
| గుర్రాల రమణయ్య | మందలపర్తి కిషోర్ |
| అనిల్ డ్యాని | విజయ్ కోగంటి |
| మందరపు హైమవతి | డాక్టర్ రావెళ్ళ శ్రీనివాసరావు |
| బొడ్డపాటి చంద్రశేఖర్ | టి. వెంకటేష్ |
| లాస్యప్రియ కుప్పా | దాసరాజు రామారావు |
| చెంగల్వ బొడ్డపాటి | పక్కి రవీంద్రనాథ్ |
| జన్నతుల్ ఫిరదౌజ్ బేగం | సరిత భూపతి |

# ఈ హత్య సామూహికం

డా. కాసల

హత్య చెయ్యడానికి
వాడికి ఆయుధం అక్కర్లేదు-
పుట్టి బుద్ధెరిగినప్పట్నుంచి
క్రూరమైన ఆలోచనలతో
నూరి నూరి పదునుపెట్టుకున్న
వికృతమైన మనస్తత్వం ఉంది.
దానికి తోడు
చిన్నప్పుడు
అమ్మా నాన్నా
చెమటోడ్చి నేర్పించిన అక్షరమ్ముక్కలతో
సంస్కారం ఒంటబట్టకపోగా
ఒళ్లంతా
విషంలా నిండిపోయిన
అతి తెలివి ఉంది.
చేతిలో
గుట్టుగా సంపాయించిపెట్టుకున్న సర్టిఫికెట్టుంది.
వాటితో
గట్టిగా సాగించిన పట్టు పరిశ్రమతో
అర్హతకి అందనివ్వక
అప్పనంగా దక్కించుకున్న ఉద్యోగం ఉంది.
అది
నెలనెలా
ఒళ్లో జీతంరాళ్లు తెచ్చిపోసి
ఆకలి బాధనుంచి
తప్పించిందే తప్ప
ఆ కుర్చీలో కూచున్నందుకు
కొందరి మనిషిలా కాక
అందరి మనిషిలా వ్యవహరించాలన్న
కనీస స్పృహని కూడ
వాడికి కలిగించలేకపోయింది.
అందులోను
ఆ పదవిగాని
పబ్లిక్ లైఫ్ గాని
అకౌంటబిలిటీ లేనివి!
అందుకే వాడు
ఆశ్రితుల్ని అందలాలెక్కిస్తూ
అర్హతల్ని తృణీకరిస్తూ
ప్రతి రోజూ, ప్రతి గంటా
ప్రతి నిమిషమూ, ప్రతి క్షణమూ
ఏదో ఒక హత్య చేస్తూనే ఉన్నాడు!
అలాంటివాడితో స్నేహం చేసి
పాపం! మనిషి
అభం శుభం తెలియనివాడు
మనసే మనిషైనవాడు
అనైతిక వాతావరణం
అంటువ్యాధిలా అలుముకున్న సమాజంలో
అమీబాలా అంతటా అల్లుకుపోతున్న
ఈ ఆటవిక మేధావి పాటించే దమన నీతిలో
అడుగడుగునా
హత్యకి గురవుతూనే ఉన్నాడు.
అయినా
అడగడానికి దేవుడా? దయ్యమా?
నిజానికి
వాళ్లెవరూ లేరని వాదించే
ఈ ఆత్మానుకూల హేతువాదిని
నిలదీయగలిగిన మగాడు-మొనగాడు-
కనీసం ఒక్కడయినా
ఒక్కడంటే ఒక్కడయినా-
ఉన్నాడా?

లేదు!
ఇది కూడదు!–అంటూ
హెచ్చరించగలిగిన గుండె ధైర్యం
మెచ్చుకోలు ఇచ్చుకాలు పలికే
ఈ అవకాశవాద అరాచకవాదుల్లో
ఏ ఒక్కడికీ
లేదు గాక లేదు!
కనుక
కళ్లయెదుట జరిగే
ఈ నిత్య హత్యాకాండలో
కళ్లప్పగించిచూస్తున్న ప్రతివాడూ
సాక్షిమాత్రుడే కాదు–
పరోక్షంగా హంతకుడు కూడ!
ఇప్పుడిక్కడ జరుగుతున్న
ప్రతి మానసిక హత్యా
వైయక్తికం మాత్రమే కాదు–
సామూహికం కూడ! ■

## రోజులు మారాయి !

మాతంగి దిలీప్‌కుమార్

రోజులు మారాయి
రాజ్యం తీరులు మారాయి

చెమట చిందే చోట
శ్రమదోపిడి చారలు చూశాం
వె(ve)ట్టి చాకిరి వెతలను వి(vi)న్నాం

అక్షరం అందిన చోట
ఆదర్శాల పుంతలు తాకాం
ఆలోచనల దొంతరలు తీశాం

కాలం కదలిక చూసేలోపే
మన గమనం గుర్తించే లోపే
ఇదేంటో వి(vi)డ్డూరం
మొరటోడు మొగుడయ్యాడు
పనోడు కూలయ్యాడు

మొన్న...
శరీర కష్టం నమ్మినోడు
శ్రామికుడు
నేడు...
తానై తెగనమ్మేవోడు
తెలివైనోడు

చదువున్నా ...
సామాజిక కోణం సున్నా
బంధాలున్నా...
అనుబంధాలన్నీ సున్నా

ఎదగటమే ముఖ్యం
సంసార సాగరాన్ని.. ఈదటమే లక్ష్యం
నీ, నా భేదం లేదు
ఆత్మగౌరవం అసలే లేదు

దోచుకోటంలో గట్టైతే
మనుగడ మర్చిపోటంలో దిట్టైతే
పాలకుడు వాడే
రాజ్య సంరక్షకుడు వాడే

సామర్థ్యం ఎంతటిదైనా
కట్టేసే ...నోట్ల కట్టలున్నాయ్
సాంకేతికతకు కల్పనల్తో
టెంకాయలు కొట్టించే ...
మర్మ నడకలున్నాయ్

రోజులు మారాయి
రాజ్యం తీరులు మారాయి ■

*(మేడే సందర్భంగా.....)*



## గుర్తుకొస్తున్నాయి-గుచ్చుకుంటున్నాయి

లలితానంద్ 9247499715

గుర్తుకొస్తున్నాయి - గుత్తులు గుత్తులుగా
కనుగుడ్ల తెరపై కదలాడు దృశ్యాల్లా
గుంపులు గుంపులుగా గుర్తొచ్చి
గుచ్చుకొంటున్నాయి తియ్యగా బంగారపు ముల్లులా

గుండె లోపలి నవనీతపు పొరల్లో
పదిలపరచిన పలచని స్మృతుల అరల్లో
ఆరుగాలం కష్టించినా -
'ఏటి ఈత లంక మేత'లా ఉండడం
పరిమిత కుటుంబం అపరిమిత సౌఖ్యం
ఆనాడే గుర్తెరిగి పాటించడం
సమస్త భగవన్నామాలూ -
లాలజలంలా నీ నోటిలో నివాసం ఉండడం
సూర్యోదయంలా నిత్యం నిష్టంగా రాత్రి స్నానాంతరం
కిరణాల్లా సాంబ్రాణి కడ్డీలని వెలిగించి ప్రార్థించడం
నీ లోకహిత ఆలోచనల పరిమళాలు
ఇల్లంతా ఆవరించడం
గుర్తుకొస్తున్నాయి - గుత్తులు గుత్తులుగా
గుచ్చుకొంటున్నాయి తియ్యగా బంగారపు ముల్లులా..!

కంటికి రెప్పలా అంటిపెట్టుకున్న
అమ్మ సుదీర్ఘ అనారోగ్యం
పిల్లల నిర్విరామ నిరంతర అంతంలేని అస్వస్థతలు
అలుపురాని ముగింపు లేని తెచ్చే
హోమియో మందులు
నమ్మకాల తాయెత్తులతో నీ భగవన్నామాలు
విశ్వాస విబూదులు ఏ ఉపశమనం కలిగించాయో!
ఆ ధ్వనులింకా నా శ్రవణాల్లో....
నీ ప్రాణంలో ప్రాణంలాంటి
అత్తయ్య, మామయ్యలతో పాటు
ఇరుగు పొరుగు సుస్తీలప్పుడూ
ఎంతగా విలవిల్లాడిపోయేవాడివో!
అర్థరాత్రి అపరాత్రి అని లేక
'కాలికి బలపం కట్టుకుని' పరుగులెత్తేవాడివో!
గుర్తుకొస్తున్నాయి గుత్తులు గుత్తులుగా
గుచ్చుకుంటున్నాయి తియ్యగా బంగారు ముల్లులా.

చదువులమ్మ సంచి దించి
శెలవుల్లో, సమ్మెల్లో పొద్దుటే పొట్ట చద్దితో నింపి
గేదె పక్క దూడలా అంటుకు వచ్చి
నీతో పొలంలో గడ్డ విరవడం గడ్డ తోలడం
గట్లు పెట్టి వక్రఘనాల్ని సక్రపరచడం
నారు కట్టలు చిమ్మడం,
నోరు నింపు నీటిలో జారిపడడం, లేవడం
దుబ్బులున్న పొట్టకొచ్చిన పచ్చపచ్చటి మాగాళ్ళలో
ఊస, గౌసు కరుణిస్తే బంగారు కంకుల్ని కళ్ళారా చూడడం
పనిలో మమేకమయ్యే మావయ్యలతో కలిసి
ఊరి వెలుపల దేవాలయాల్లాంటి
కుప్పలు వేయడం, కుప్పలు నూర్చడం,
తిరగేసి కొట్టడం ఎకసెక్కాల హాస్యోక్తులతో
నూర్పిళ్ళలో ఎంత తిన్నా నూర్పిడి అవ్వడం
భూ ప్రదక్షిణంలా బంతి తోలడం,
'ఒలియో ఒలియో రావేల గలవాడా..
రారా పోలిగాడా' అంటూ

హోరుజోరులో తూర్పారపట్టటం
నెలవంక రూపు గడ్డి కడియం వేయడం
స్వర్ణరాశుల్ని కుదురైన బస్తాల్లో పట్టడం
గుర్తుకొస్తున్నాయి – గుత్తులు గుత్తులుగా
గుచ్చుకొంటున్నాయి తియ్యగా బంగారపు ముల్లులా!

తెల్లవారు జామున కునుకుతూనే
కుప్పలకై కట్టు ముడివేయడం
వడ్రంగి పిట్టలా నేలను తొలిచి పాతర తియ్యడం
తల్లి భూదేవి అలుకుడు వస్త్రానికై
వెన్నలాంటి ఒండ్రుమట్టి తోలడం
గుర్రం జీనుపైనలా పెదనాన్నగారి
మెలిక కొమ్మల కర్రి గేదపై ఎక్కి కూర్చోవడం
దిగేవరకు అది కుప్పిగంతులేస్తూ గెంతడం
నీ మనసంతటి చల్లటి నీటిలో గేదల్ని కడగడం
దొడ్డంతా నిండుగా, చెలిమికి చిహ్నంగా ఉండే
ఎడ్లకి ఉలవలు, గేదలకు కుడితిపెట్టి
బుల్లి బుల్లి బుజ్జాయిలకు పిలకలందించి
మురిపాలాడి నా పొట్ట నింపుకోవడం
మనలాంటి మన ఆవు కోడెతో
మామయ్య గారి ఎద్దు(ఆవు సోదరుడు)మామతో
జత కలిపి బండి కట్టటం, తోలడం
ఆ కోడె కళ్ళిప్పటికీ నా కళ్ళల్లో / కాంతి గోళాలై
కదలాడుతూనే ఉంటున్నాయి, కెలుకుతుంటాయి
ఎలపట దాపటి మైసూరు ఎద్దుల బండితో సవారీలు
చావిడి ఎరువులతో బండి జల్ల నింపి తోలడం
మట్టిగడ్డలేసుకు తిరిగిరావడం
గిత్తల గిట్టలకు నాడాలు వేయడం,
బండికి చక్రాలు విప్పి తారేయడం వింతగా చూడడం,
పట్టెడ పగ్గాలు, సిగమోర, చిక్కం, ముకుతాడు
చిడతలు, వసిగర్రలు, యాగర్రలు, తొట్టి
సరిచూసుకోవడం సరిచేసుకోవడం
గుర్తుకొస్తున్నాయి – గుత్తులు గుత్తులుగా
గుచ్చుకొంటున్నాయి తియ్యగా బంగారపు ముల్లులా!

ప్రైవేటు మాస్టారితో ప్రతిసారీ మరవక
'మేము ఇచ్చేది ఎటుపోతుందో
మీరు ఇచ్చేది, చెప్పేది ఎల్లకాలం ఉంటుంది' లాంటి
ఆణిముత్యాల్లాంటి మాటల్లో వాస్తవాలు
నింగినంటు నిలువెత్తు సత్యం
నిత్యం నిలుస్తుంది నాముందు
నీలాంటి వాళ్ళు వాళ్ళలాంటి నీవు
లేకుంటే నేనెక్కడ ఉండేవాడినో! ఏమై ఉండేవాడినో!
తలచుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది
అఖిల ప్రపంచానికాహారం వారి చలవనేది విస్మరించి
'మేము నీలాగ కారాదని మట్టి పిసుక్కోరాదనీ' –
అనుదినం.. అన్నింటా.. ఎంత ఎంతెంత ఆతురత
ఇంటిల్లిపాదీ పగలూ రేయనక
అన్ని రుతువుల్లో ఏదొక రుగ్మతలపాలైనప్పుడు
ఆసులో దారంలా మందూ మాకులకై
ఎంతగా తిరిగేవాడివో! ఇప్పటికీ నా కాశ్చర్యమే!
అర్ధరాత్రి అపరాత్రి... ఆ కాలం ఈ కాలం
అని లేక కాలికి చక్రాలు కట్టుకున్నట్లు
ఇల్లూ పొలం వైద్యుల చుట్టూ –
ఆ పలచటి నీ ఉల్లిపొర శరీరంతో అన్నన్నిసార్లు
ఎట్లా తిరిగేవాడివో! వక్కి చక్రాలకి
అంతటి శక్తి ఎంతటిదో – నాకెంతకీ అంతుబట్టదు
గుర్తుకొస్తున్నాయి – గుత్తులు గుత్తులుగా
గుచ్చుకొంటున్నాయి తియ్యగా బంగారపు ముల్లులా!

ప్రాతఃకాలంలో పడుకునేముందు
అమ్మతో నీ మాటల్లో దొర్లే ఊర్లో విషయాల్లో
మానవసంబంధాల పట్ల నీ తపనలు
ఇప్పటి తరాలు చేరాల్సిన తీరాలుగా
నన్ను నిరంతరం తన్మయపరుస్తాయి విస్మయంతో

మామయ్యనూ, నిన్నూ వైజాగ్‌లో
కార్లో త్రిప్పి చూపించడం
తరచూ నీవు తలచుకోవడం మురిసిపోవడం
ఉపాధి కల్పించిన
'వెంకటరత్నం' గారిని మరవక పోవడం
'మనం చేసినవి వెంటనే మరవాలి
మనకు చేసినవి
ఎన్నడూ మరువరాదు'కు నిదర్శనం.
అన్యులు అసూయపడేలా మామయ్యా – నీవూ
కృష్ణార్జునుల మించి అన్యోన్యంగా ఉండడం
ఏడు దశాబ్దాలకు పైగా అరమరికలు లేకుండా
ఆయన క్షేమమే నీ క్షేమంగా భావించి
నీ అణువణువూ కరిగించి
ఆయనకు అంకితమవ్వడం
ఏమిచ్చినా ఇవ్వకున్నా
కడవరకూ అలాగే ఉండడం
అంతిమ గడియల వరకూ
ఆయనకై తపించడం–
అబ్బాయి పెండ్లి తృప్తిగా చూసి మురిసిన
నీవు అమ్మాయి పెండ్లికి లేకపోవడం
'తన పుట్టిన రోజెప్పుడో చెప్పమని
అమ్మాయి అడిగి ఆట పట్టించడం లాంటివి
ఎన్నో ఎన్నెన్నో మరెన్నో...
అమ్మ అంతిమ సంస్కారాల్ని చూసి
ఎంతగానో సంచించడం –
అమ్మ సంవత్సరీకం చూడాలని ఉబలాటపడడం
అంతలోనే తొందరపడి అర్థాంతరంగా వెళ్ళిపోవడం
గుర్తుకొస్తూనే ఉన్నాయి–గుచ్చుకుంటూనే ఉన్నాయి!!
గుర్తుకొస్తున్నాయి – గుత్తులు గుత్తులుగా
గుచ్చుకొంటున్నాయి తియ్యగా బంగారపు ముల్లులా!■



# రూపాయి

అరసవిల్లి కృష్ణ 92472 53884

చెల్లని రూపాయిని జేబులో వేసుకొని
దేశమంతా తిరుగుతున్నాను
దారుల్ని విశాలం చేస్తూ
రూపాయి నోటుతో మట్లాడుతున్నాను
ఆకాశం నామాట విని పగలబడి నవ్వింది
జేబులో రూపాయి నోటు ను తడిమాను
చెమటకు తడిచి ముద్దయింది
ఎండలో ఆరబెట్టాను
ఆకాశం మళ్ళీనవ్వింది
ఎండకు ఆరిన రూపాయి గాలిపటం లా ఎగిరింది
ఇంత వరుకు రూపాయి తోడనుకున్నాను
రూపాయి జేబులో వుంటే
ప్రపంచం నాదనుకున్నా
నా చెమట బిందువు ఆకాశంలో
నక్షత్రంలా మెరుస్తుంది
అతనెవరో మైకు ముందు మాట్లాడుతున్నాడు.
భారత దేశప్రధాని అట–
నా రూపాయి నాకివ్వమన్నాను
కోటా బియ్యం కొనాలన్నాను
నా దేశానికి ఆకలేస్తుందని అరిచాను
అతనేదో మాట్లాడాడు
అతని భాష నాది కాదు అతను నావాడు కాదు
మళ్ళీ ఆకాశం నవ్వింది ■

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Kavitaa+47](http://kinige.com/book/Kavitaa+47)**

* * *